శబరిమల పాదయాత్ర ప్రారంభం



ఘట్‌కేసర్‌: గురుస్వామి అంజనేయులు ముదిరాజ్‌ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్‌–శబరిమల పాదయాత్ర సోమవారం ఘనంగా ప్రారంభమైంది. పట్టణంలోని మున్సిపల్‌ కార్యాలయం పక్కనున్న శ్రీ అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఇరుముడి కట్టుకున్నారు. శివారెడ్డిగూడ శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద స్థానికులు స్వాగతం పలికారు. ఆలయం ఆవరణలో అయ్యప్పలకు అన్నప్రసాదం చేశారు. 41 రోజుల పాటు సుమారు 1600 కిలోమీటర్ల దూరం పాదయాత్ర పూర్తి చేసుకొని స్వామి అయ్యప్పను దర్శించుకోనున్నారు.

వినతులపై తక్షణమే స్పందించాలి



సాక్షి,సిటీబ్యూరో: వివిధ సమస్యలపై ప్రజలిచ్చే వినతులపై సంబంధిత జిల్లా అధికారులు సత్వరమే స్పందించి తక్షణ పరిష్కారం కోసం కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ప్రజల నుంచి 33 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. వినతులపై చేపట్టిన చర్యలపై ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌ పోర్టల్‌లో అప్‌లోడ్‌ చేయాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యతనిస్తూ పరిష్కరించాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా పరిష్కరించాలన్నారు. ఇందులో జిల్లా లా–ఆఫీసర్‌ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత పంపిణీ



ఘట్‌కేసర్‌: అవుషాపూర్‌లో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆధ్వర్యంలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీతలను హిందూ జ్ఞాన వేదిక హైదరాబాద్‌ భువనగిరి ప్రతినిధులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ద్వాపర యుగంలో శ్రీ కృష్ణుడు యుద్ధ రంగంలో అర్జునుడికి బోధించాడని, ప్రపంచంలో మొట్ట మొదటి పవిత్ర గ్రంథం భగవద్గీత అన్నారు. గీతలోని సారాంశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక సభ్యులు దేవేంద్ర, ధన్వంతరి, వాసవి తదితరులు పాల్గొన్నారు.

సీఐకు సన్మానం



ఘట్‌కేసర్‌: ఘట్‌కేసర్‌ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పరశురాంను పలువురు నాయకులు సోమవారం పీఎస్‌లో కలిసి సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై శేఖర్‌, నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, రవి, శేఖర్‌, శ్రీనివాస్‌, శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

ఘట్‌కేసర్‌: పట్టణంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ జరిగింది. ఇన్‌స్పెక్టర్‌ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం అంగన్‌వాడీ కేంద్రంలోకి ఓ దుండగుడు ప్రవేశించి చిన్నారులకు ప్రభుత్వం సరఫరా చేసే పాల ప్యాకెట్లు, గ్యాస్‌స్టౌవ్‌, సిలిండర్‌తో పాటు వెయింగ్‌ మిషన్‌ ఎత్తుకెళ్లాడు. సోమవారం అంగన్‌వాడీ టీచర్‌ విజయలక్ష్మీ కేంద్రాన్ని తెరిచి చూడగా తలుపులు పగులగొట్టి ఉండడంతోపాటు లోపలికి తదితర వస్తువులు, సామగ్రి కనిపించకపోవడంతో పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనారోగ్యంతో కౌన్సిలర్‌ హిమ మృతి

పోచారం: అనారోగ్యంతో బాధపడుతున్న 8వ వార్డు కౌన్సిలర్‌ హిమ సోమవారం మధ్యాహ్నం మృతి చెందారు. అన్నోజిగూడలోని రాజీవ్‌ గృహకల్ప కాలనీకి చెందిన హిమ కొద్ది కాలంగా క్యాన్సర్‌ వ్యాధితో బాధపడుతున్నారు. బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్‌ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ తుది శ్వాస విడిచారు. భార్య వియోగంతో భర్త ఐలయ్య కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. హిమ, ఐలయ్య దంపతులకు కుమార్తె, ఇద్దరు కుమారులు కలిగారు. కుమార్తె వివాహం చేసుకొని అమెరికాలో ఉంటోంది. యుక్త వయస్సుకు వచ్చిన ఓ కుమారుడు ఏడాది కింద ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను మరణించిన తర్వాత హిమ మరో కుమారునికి జన్మనిచ్చింది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని స్వగ్రామమైన గౌరాయిపల్లిలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీకొట్టిన వాహనం



మల్లాపూర్‌: వాకింగ్‌కు వెళ్లి బైక్‌పై తిరిగి ఇంటికి వస్తున్న ఇద్దరు యువకులను రాంగ్‌ రూట్‌లో వచ్చిన ఓ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటన సోమవారం ఉదయం నాచారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. నాచారం ఇన్‌స్పెక్టర్‌ రుద్వీర్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. నాచారం కౌండిన్యనగర్‌కు చెందిన రవికుమార్‌ కుమారుడు శ్రీదత్తు (18) నాచారం హెచ్‌ఎంటీనగర్‌లో తన స్నేహితుడు మోహిత్‌ (18)తో కలిసి వాకింగ్‌కు వెళ్లి తిరిగి గ్లామర్‌ (ఏపీ 16సీపీ1706) ద్విచక్రవాహనంపై వస్తుండగా.. నాచారం అను ఫర్నిచర్‌ వద్దకు రాగానే రాంగ్‌రూట్‌లో అతివేగంతో వచ్చిన (టీఎస్‌12 యూడీ2646) అశోక్‌ లేలాండ్‌ వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో యువకుల కాళ్లు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన స్థానికులు యువకులను మెరుగైనా చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని కిమ్స్‌ ఆస్పత్రికి తరలించారు. ద్విచక్రవాహనంతో పాటు మరో రెండు కార్లను అశోక్‌ లేలాండ్‌ ఢీ కొట్టడంతో కార్లు కుడా స్వల్పంగా ధ్వసమయ్యాయి. డ్రైవర్‌ ఖాదర్‌ను పోలీసులు అదుపులోకి విచారిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం సేకరణకు 13 కొనుగోలు కేంద్రాలు



సాక్షి,సిటీబ్యూరో: ఖరీఫ్‌ సీజన్‌లో రైతు పండించిన వరి ధాన్యామంతా కొనుగోలు చేసేందుకు జిల్లా అధికారయంత్రాంగం సన్నద్ధమవుతోంది. ధాన్యం సేకరణకు 13 కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసిన జిల్లా పౌరసరఫరాల శాఖ ఘట్కేసర్‌ మండలం మాదారంలో ప్రారంభించినప్పటికినీ, ధాన్యం కొనుగోళ్లు మాత్రం ఇప్పటి వరకు చేపట్టలేదు. మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో వరి పంట సాగుకు అనుగుణంగా 40 వేల మెట్రిక్‌ టన్నుల ధాన్యం రాగలదని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. కలెక్టర్‌ గౌతమ్‌ ఆదేశాలతో జిల్లా పౌరసరఫరాల శాఖ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన వసతులను కల్పించటంతోపాటు 25 వేల మెట్రిక్‌ టన్నుల ధాన్యం సేకరించేందుకు కసరత్తు చేస్తోంది.

పెరిగిన వరి సాగు

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో ఖరీఫ్‌ సీజన్‌ (వానాకాలం)లో సాధారణ వరిపంట సాగు విస్తీర్ణం 15,066 ఎకరాలు కాగా, రైతులు మాత్రం 17,500 ఎకరాల్లో వరి పంట వేశారు. దీంతో వరి పంట దిగుబడి సుమారుగా 40 వేల మెట్రిక్‌ టన్నులు రాగలదని జిల్లా వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. రైతులకు అన్నీ విధాలుగా సదుపాయాలు కల్పించటంతోపాటు పండించిన వరి ధాన్యానికి కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఈ సారి సన్న రకం వరి ధాన్యానికి మద్దతు ధరతోపాటు అదనంగా బోనస్‌ రూ. 500 ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. వరి పంటకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం గ్రేడ్‌ 'ఎ' వరి ధాన్యానికి క్వింటాల్‌ ధర రూ.2,320 కాగా, సాధారణ వరి. ధాన్యానికి క్వింటాల్‌ ధర రూ.2,300 లుగా నిర్ణయించింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, కాంటాలు, తేమ యంత్రాలు, గన్నీ బ్యాగులతోసహా కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో గోదాముల్లోకి తరలించేందుకు రవాణా సౌకర్యాన్ని కల్పించారు. ధాన్యం సేకరణ కేంద్రాల్లో తాగు నీటి వసతితో పాటు షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని 13 ధాన్యం సేకరణ కేంద్రాల్లో 7.50 లక్షల గన్నీ బ్యాగులు అవసరమని జిల్లా పౌరసరఫరాల శాఖ అంచనా వేసినప్పటికిని, అదనంగా 1.30 లక్షల గన్నీ బ్యాగులను రైతులకు అందుబాటులో ఉంచారు.

ధాన్యం సేకరణ కేంద్రాలివే..

మేడ్చల్‌ జిల్లాలో 13 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ప్రతాపసింగారం, ఏదులాబాద్‌, మాదారం (ఘట్కేసర్‌ మండలం), కేశవరం , ఉద్దమర్రి(మూడు చింతలపల్లి మండలం), మేడ్చల్‌, పూడూరు(మేడ్చల్‌ మండలం), జగ్గంగూడ, కీసర మండలం తదితర కేంద్రాల్లో ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మాదారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినప్పటికిని, ఇప్పటి వరకు ధాన్యం సేకరణ చేపట్టలేదు.

ధాన్యమంతా కొంటాం



రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు 13 సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి, మాదారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాం. త్వరలో మిగతా కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తాం. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో ధాన్యం సేకరిస్తాం. కొనుగోలు కేంద్రానికి రైతులు ధాన్యంతోపాటు తమ వెంట ఆధార్‌ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా జిరాక్స్‌ తెచ్చుకోవాలి.

–సుగుణబాయి, మేనేజర్‌, పౌరసరఫరాల శాఖ, మేడ్చల్‌ జిల్లా

సెంటర్‌కు నిర్దేశించిన సమయంలో రావాలి

గ్రూప్‌–1 అభ్యర్థులకు కలెక్టర్‌ సూచన



సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ నిర్వహిస్తున్న గ్రూప్‌–1 సర్వీసెస్‌ మెయిన్స్‌ రాత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాలలోనికి అనుమతిస్తారని మేడ్చల్‌– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ తెలిపారు. ఈ నెల 21 నుంచి 27 వరకు జరిగే గ్రూప్‌–1 సర్వీసెస్‌ మెయిన్స్‌ రాత పరీక్షలకు సంబంధిత అధికారులంతా సమన్వయంతో ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. గ్రూప్‌–1 సర్వీసెస్‌ మెయిన్స్‌ రాత పరీక్ష కోసం జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్ష మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు మాత్రం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 వరకు మాత్రమే పరీక్షా కేంద్రాలలోనికి అనుమతిస్తారని స్పష్టం చేశారు.

ఐటీఐలో దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్‌: ప్రభుత్వం ఐటీఐల్లో ప్రవేశపెట్టిన నూతన కోర్సుల్లో సీట్ల భర్తీ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మేడ్చల్‌ ఐటీఐ ప్రిన్సిపాల్‌ హనుమనాయక్‌ కోరారు. ప్రభుత్వం ఐటీఐల్లో 6 రకాల నూతన కోర్సులను ప్రవేశపెట్టిందని, 10వ తరగతి పాసై 14 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు ఈనెల 14 నుంచి 19వ తేది లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

108 కాల్‌సెంటర్‌లో ఉద్యోగ అవకాశాలు

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఈఎంఆర్‌ఐ గ్రీన్‌ హెల్త్‌ సర్వీస్‌ సంస్థలో 108 కాల్‌సెంటర్‌లో ఉద్యోగాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రాం మేనేజర్‌ షేక్‌ జాన్‌ షాహిద్‌ ప్రకటన ద్వారా తెలిపారు. కస్టమర్‌ సపోర్ట్‌, కాల్‌సెంటర్‌ ఎగ్జిక్యూటీవ్‌ పోస్టులకుగాను గ్రాడ్యుయేట్లు, అండర్‌ గ్రాడ్యుయేట్లు ఈ నెల 15 నుంచి 19 వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఇంటర్వ్యూలకు ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా హాజరుకావాలని కోరారు. అభ్యర్థులు తమ ఒరిజినల్‌ సర్టిఫికేట్లు, ధృవీకరణ పత్రాలను వెంట తీసుకురావాలన్నారు.

ప్రజావాణితో సమస్యల పరిష్కారం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 2 దరఖాస్తులు అందాయని మున్సిపల్‌ అధికారులు తెలిపారు. ప్రజావాణిలో ప్రజల నుంచి అందే వినతిపత్రాలను సత్వరమే పరిష్కరించడమే ధ్యేయంగా అధికారులు దృష్టి సారించాలని మేయర్‌ అమర్‌సింగ్‌ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ ఇంజినీర్‌ సాయినాథ్‌గౌడ్‌, రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్‌ సిబ్బంది, విద్యుత్‌ అధికారులు తదితరులు పాల్గొన్నారు .

అందుబాటులో ఉంటా.. సమస్యలు పరిష్కరిస్తా



మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌ను కలిసిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్‌: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్‌ నేత కూన శ్రీశైలంగౌడ్‌ అన్నారు. సోమవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో కొంపల్లి మున్సిపల్‌, నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను శ్రీశైలంగౌడ్‌కు విన్నవించగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి తగుచర్యలు చేపట్టాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని, అభివృద్ధి ఫలాలు అన్ని ప్రాంతాలకు అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

మురుగు సమస్యను పట్టించుకోండి



ఉప్పల్‌ నుంచి చిలుకానగర్‌ రోడ్డుపై ఇలా..

ఉప్పల్‌: ఉప్పల్‌ నుంచి చిలుకానగర్‌ రోడ్డు మురుగుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డంతా మురుగు పారుతుండటంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిలుకానగర్‌ రోడ్డు బీరప్పగడ్డ దిగగానే రమేష్‌ టెంట్‌ హౌస్‌ ఎదుట గతేడాదిగా మురుగు సమస్య వెంటాడుతోంది. ఈ విషయంపై స్థానికులు, వాహనదారులు పలుమార్లు ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేశారు. తూతూ మంత్రంగా అప్పటికప్పుడు పనులు చేపట్టి తదానంతరం రెండు గంటల్లోపే పరిస్థితి యథాస్థితికి వస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జన్మదిన శుభాకాంక్షలు



కుత్బుల్లాపూర్‌: కొంపల్లి మున్సిపాలిటీ బీజేపీ ఫ్లోర్‌ లీడర్‌, జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. కొంపల్లిలో ఆయన నివాసానికి బీజేపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తల పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనతో కేకులు కట్‌ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అసెంబ్లీ కో–కన్వీనర్‌ పాత్తూరి శివాజీ రాజు, రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు సరితారావు, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్‌సాగర్‌, కొంపల్లి పట్టణ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నాయకులు కొండల్‌రెడ్డి, శంకర్‌నాయక్‌, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు వైష్ణవి



కుత్బుల్లాపూర్‌: ఖేలో ఇండియా సౌత్‌ జోన్‌ సబ్‌ జూనియర్‌ జాతీయ స్థాయి పోటీలకు కుత్బుల్లాపూర్‌ పద్మానగర్‌ ఫేజ్‌–2లోని శ్రీనిధి గ్లోబెల్‌ స్కూల్‌ విద్యార్థి వైష్ణవి ఎంపికైంది. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వైష్ణవి ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో శ్రీనిధి స్కూల్స్‌ చైర్మన్‌ వెంకటేశ్వర్‌రావు, ప్రెసిడెంట్‌ మేడమ్‌ రాజేశ్వరి, ప్రిన్సిపాల్‌ ఎస్‌. కోమలా దేవి, పీఈటీ శ్రీకాంత్‌ విద్యార్థి వైష్ణవిని అభినందించారు.

మహాత్ముల విగ్రహాలను తొలగించడం అమానుషం



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న అత్వెల్లి కౌన్సిలర్లు

మేడ్చల్‌: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా అత్వెల్లి పరిధిలో గతంలో 44వ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలను తొలగించడం అమానుషమని అత్వెల్లి పరిధిలోని మున్సిపల్‌ కౌన్సిలర్లు రోయ్యపల్లి సరిత మల్లేష్‌గౌడ్‌, మానస శ్రవణ్‌కుమార్‌ గుప్తా, దేవరాజ్‌, రవీందర్‌రెడ్డి అన్నారు. విగ్రహాలను ప్రత్యామ్నాయ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కమిషనర్‌ నాగిరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. అత్వెల్లి పరిధిలో జాతీయ రహదారి పక్కన మహాత్మగాంధీ, అంబేడ్కర్‌, సుభాష్‌ చంద్రబోస్‌, వివేకానంద, వేమన, వంటి మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 44వ జాతీయ రహదారి విస్తరణ నేపథ్యంలో ఇతర ప్రాంతంలో ఏర్పాటు చేయకుండా తొలగించారని విస్తరణ తర్వాత మహనీయుల నూతన విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. మహనీయుల విగ్రహాలను తొలగించి ప్రజల మనోభావాలను దెబ్బతీయడం సబబు కాదన్నారు.

పీహెచ్‌సీలను పరిశీలించిన కేంద్ర బృందం



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సోమవారం కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణ బృందం సందర్శించింది. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల కింద ముఖ్యమైన ఆరోగ్య సూచికలను సమీక్షించడానికి కేంద్రం బృందం ఈ పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించింది. జిల్లాలోని కుషాయిగూడ పీహెచ్‌సీతోపాటు పలు ఆరోగ్య సెంటర్‌లను కేంద్ర బృందం పరిశీలించటంతోపాటు వ్యాక్సిన్‌ లాజిస్టిక్స్‌, పుట్టిన వెంటనే ఇచ్చే టీకాల ప్రక్రియ, అనాఫైలాక్సిస్‌ కిట్‌ల వంటి కీలక వనరుల లభ్యతపై దృష్టి సారించారు. పర్యవేక్షక బృందం పుట్టిన వెంటనే పిల్లలకు ఇచ్చే టీకాల నిర్వహణపై సమీక్షించటంతోపాటు టీకాలు తక్షణం అందుతున్నాయా లేదా అన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్‌ రఘునాథ్‌స్వామి, ఉప జిల్లా వైద్య, ఆరోగ్య ఉప అధికారులు డాక్టర్లు సత్యవతి, శోభ, జిల్లా ప్రోగ్రామ్‌ అధికారి సరస్వతి పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి



మల్కాజిగిరి ఏసీపీకి వినతిపత్రం ఇస్తున్న నాచారం వాసులు

మల్లాపూర్‌: నాచారం, హబ్సిగూడ ప్రధాన రహదారిలో భవిష్యత్తులో యాక్సిడెంట్‌ ఫ్రీ జోన్‌గా చేయాలని కోరుతూ రవినాయక్‌ ఆధ్వర్యంలో సోమవారం ట్రాఫిక్‌ డీసీపీ మనోహర్‌, మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణికి వినతిపత్రం అందజేశారు. గత మూడు నెలలుగా నాచారం, హబ్సిగూడ ప్రధాన రహదారిలో రోడ్డు ప్రమాదాల కారణంగా సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించే చర్యలో భాగంగా యూటర్న్‌లను మార్చాలని కోరారు. రాంగ్‌రూట్‌ వాహనాలను నడిపేవారిపై రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేసే వారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ప్రకాష్‌, మల్లెల నర్సింగ్‌రావు, గోపాల్‌గౌడ్‌, రవీందర్‌రెడ్డి, సురేష్‌గౌడ్‌, శ్రీనివాస్‌, నవీన్‌, ఆర్కే నాయుడు, మోహన్‌రెడ్డి, నవీన్‌గౌడ్‌, దయానందగౌడ్‌ తదితరులున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



డ్రైనేజీ పనుల ప్రారంభోత్సవంలో మేయర్‌ అజయ్‌యాదవ్‌

బోడుప్పల్‌: దశల వారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్‌ మేయర్‌ తోటకూర అజయ్‌యాదవ్‌ అన్నారు. 8వ డివిజన్‌ పరిధిలోని ద్వారకానగర్‌ కాలనీలో రూ. 29లక్షలతో చేపట్టిన అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ పనుల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తొలుత డ్రైనేజీ పనులు చేపట్టి అనంతరం సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు వివరించారు. మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. కార్పొరేటర్లు సీసావెంకటేష్‌గౌడ్‌, మోదుగు లావణ్యశేఖర్‌రెడ్డి, కుంభంకిరణ్‌కుమార్‌రెడ్డి, సుమన్‌నాయక్‌, కాంగ్రెస్‌ పార్టీ నేతలు కొత్త కిశోర్‌గౌడ్‌, పొన్నం తరుణ్‌గౌడ్‌, వెంకటేశ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకు విద్యార్థులు కృషి చేయాలి

ఉప్పల్‌: అవినీతి నిర్మూలనకు విద్యార్థులే నడుంబిగించాలని నాచారం బెల్‌ కంపెనీ జీఎం. డా. సీహెచ్‌ విశ్వనాథం సూచించారు. ఈ మేరకు నాచారం భారత్‌ ఎలక్ట్రికల్‌ లిమిటెడ్‌ ఆధ్వర్యంలో సోమవారం ఉప్పల్‌ డిగ్రీ కళాశాలలో విజిలెన్స్‌ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశ అర్థిక, రాజకీయ, సామాజిక పురోగతికి అవినీతి ప్రధాన అవరోధంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అవినీతిపై ప్రభుత్వ అధికారులు, ప్రైవేట్‌ రంగం, ప్రజలు, యువత కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రిన్సిపాల్‌ డా. కె.విజయ్‌కుమార్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ డా.రవిప్రసాద్‌, కె. విశ్వనాథ్‌, తిరుపతయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలందక కార్మికుల ఇబ్బందులు

సాక్షి,సిటీబ్యూరో: పురపాలక సంఘాలు, పంచాయతీతోసహా పలు రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు నెలల తరబడి వేతనాలు అందకపోవటంతో వారి కుటుంబాలు దయనీయమైన పరిస్థితిని ఎదుర్కొవలసి వస్తోంది. కార్మికులకు నెలనెల చెల్లించకపోవటంపై పలు కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గ్రామ పంచాయతీ, పురపాలక సంఘాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులతోసహా ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు మధ్యాహ్న భోజన వంట కార్మికులకు దాదాపు 4 నెలల నుంచి 8 నెలల వేతనాలు అందకపోవటంతో పూట గడిపేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పులతో జీవితాలను నెట్టుకరావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

- 34 గ్రామ పంచాయతీల్లో 700 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. ఈ కార్మికులకు ఒక్కో పంచాయతీని బట్టి 4 నెలల నుంచి 8 నెలల వేతనాలు చెల్లించాల్సి ఉందని పేర్కొంటున్నారు.
- 793 అంగన్‌వాడీ కేంద్రాల్లో వెయ్యి మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరికి 2 నెలలుగా వేతనాలు, 6 నెలల నుంచి అద్దె భవనాల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. 3 నెలల నుంచి కూరగాయల బిల్లులు ఇవ్వటం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో 1100 మంది ఆశవర్కర్స్‌ పని చేస్తున్నారు. వీరికి 3 నెలలుగా జీతాలు రావటం లేదు. ప్రభుత్వ బడుల్లో పని చేసే మధ్యాహ్నం భోజన వంట కార్మికులకు కూడా 3 నెలలుగా జీతాలు ఇవ్వటం లేదు. కూరగాయలు, సరుకులకు సంబంధించిన బిల్లులు 3 నెలల నుంచి అందటం లేదు.

విలీన పంచాయతీల్లోనూ అంతే..

పురపాలక సంఘాల్లో విలీనమైన 28 గ్రామ పంచాయతీల్లో పని చేసే గ్రామ కార్యదర్శులతోసహా సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పరిస్థితి ఇదే విధంగా ఉంది. 28 పంచాయతీల్లో సిబ్బంది, కార్మికులతో కలిసి 350 మంది పని చేస్తున్నప్పటికిని, 4 నెలల నుంచి వేతనాలు రావటం లేదు. వీరంతా విలీనమైన 7 పురపాలక సంఘాల్లో పని చేస్తుండటంతో సంబంధిత పురపాలక సంఘం జీతాలు చెల్లిస్తుందని భావిస్తున్నప్పటికిని, అయోమయ పరిస్థితి నెలకొంది. వీరికి పంచాయతీరాజ్‌ శాఖ వేతనాలు చెల్లిస్తుందా.. లేక పురపాలక శాఖ అందజేస్తోందా తెలియటం లేదంటున్నారు. వీరంతా ఎవరి పరిధిలో ఉంటారన్న విషయంపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ కార్యదర్శులకు మాత్రం తామే వేతనాలు చెల్లిస్తామని పంచాయతీరాజ్‌ శాఖ పేర్కొంటున్నప్పటికీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించే విషయంపై సందిగ్ధత ఉంది.

1 నుంచి 9 ఫార్మాట్‌ వరకు

1 నుంచి 9వ ఫార్మాట్‌ పరిధిలోని ఆస్తులు, సిబ్బంది లావాదేవీలు, పెండింగ్‌ బకాయిలు తదితర వాటి వివరాలకు సంబంధించిన మినిట్స్‌, అకౌంట్‌ పుస్తకాలను విలీన పంచాయతీల నుంచి పురపాలక సంఘాలు హ్యాండ్‌ ఓవర్‌ చేసుకోవాల్సి ఉన్నప్పటికిని, నిర్లక్ష్యాన్ని ప్రదర్శించటంతో.. అధికారులు, ఉద్యోగులు, కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ రాజ్‌ శాఖ మాత్రం 1నుంచి 9వ ఫార్మాట్‌కు సంబంధించి పుస్తకాలను పురపాలికల్లో అందజేయాలని ఒత్తిడి తెస్తోందని వారు పేర్కొంటున్నారు. పుస్తకాలన్నీ అందజేయాలని పంచాయతీశాఖ ఒత్తిడి తెస్తుండగా, ఆదేశాలు లేనిదే తీసుకోలేమని పురపాలకశాఖ గిరి గీసుకుని ఉండటంతో.. విలీన పంచాయతీల్లోని సిబ్బంది, ఉద్యోగులు నానా అగచాట్లు పడుతున్నారు.